# త్యాగానికి చివరి అంచున!



ఆమె ఎప్పుడో ఏడవతరగతి చదువుకొంటున్నప్పుడు చూసింది అమెరికాను_అట్లాసులో! అంతకు మునుపు రెండేండ్ల కిందట అయిదవ తరగతి చదువుకొంటునప్పుడు తిరుమలకొండకు 'ఇల్లుతీర్థం'గా వెళ్ళితే అప్పుడు చూసింది తిరుపతిని!

అట్లాసులో అమెరికాను అంతకుమునుపు తిరుపతిని చూసింది ఎప్పుడు?

మూడు దశాబ్దాలకు మునుపు!

మూడు దశాబ్దాలకు మునుపు తాను ఏడవ తరగతి చదివింది పేటలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో. అయిదవ తరగతి చదివింది పుట్టి పెరిగిన ఊళ్ళోని ప్రాథమిక పాఠశాలలో. ఈ ముప్పై ఏండ్ల కాలగమనంలో ఊళ్ళో ఊహించలేనంత మార్పు.... పేటలో అంతకంటే పెద్ద మార్పే రాకుండా ఉంటుందా?

అప్పటికి ఇప్పటికి పోలికలే లేనంత మార్పు వచ్చి ఉంటుందని ఆమెకు తెలుసు. అయినా నోరుగుడ్డి కాదు కదా? అన్నదే ఆమె ధైర్యం. ఆ ధైర్యంతోనే ఆమె తిరుపతికి బయలుదేరింది.

అనుకుంటే చాలు. మనిషి అవలీలంగా అమెరికా వెళ్ళి రాగలుగుతున్న ఈ రోజుల్లో ఆమె మాత్రం అరవై కిలోమీటర్ల దూరాన ఉన్న తిరుపతిని చేరుకోవడానికి అష్టకష్టాలు పడింది. పడదా మరి?

ఆమె కాదు. ఆ స్థితిలో ఉంటే ఎవరైనా పడక తప్పదు! అరవై గడపలకు ఒకటి రెండు అటో ఇటోగా గడపలున్న ఆ పల్లె తనలో ఇముడ్చుకోలేనట్లుగా నెట్టేస్తే ఊరి చివరలో చుట్టు గుడిసె. ఆ గుడిసెలో తానూ, తన కొడుకు. తల్లీ కొడుకుల బాధల్ని తనగుండెల్లో ఇముడ్చుకొని ఆ చుట్టు గుడిసె!

గతాన్ని తలపోసుకొంటూ...విధిని తిట్టుకొంటూ...వద్దన్నా అప్పుడప్పుడు కట్టలు తెంచుకొంటున్న కన్నీటిని తుడుచుకొంటూ...ఒకరి ముఖం ఒకరు దీనంగా చూసుకొంటూ బిక్కుబిక్కుమని ఆ గుడిసెలో ఎన్నాళ్ళు? నాళ్ళుకాదు గదా. ఎన్నో ఏండ్లుగా. ఇదంతా తన కర్మ కాకపోతే మరేంవిటి?

పుట్టడానికేం? ఇద్దరు అక్కచెల్లెండ్లు...ఇద్దరు అన్నదమ్ముల మధ్య పుట్టింది. పెరగడానికేం? భోగభాగ్యాల్లో తేలియాడక పోయినా ఉన్నంతలో అపురూపంగానే పెరిగింది. చదువు కోడానికేం? ఉద్యోగాలు చేసి ఊళ్ళేలాలన్న ఉబలాటంతో శ్రద్ధగా చదివింది.

అయితే కలిసి మాట్లాడుకొన్నట్లుగా తల్లీదండ్రి ఏడాది తిరిగీ తిరగకముందే ఒకరి తర్వాత ఒకరుగా చెల్లిపోతే తన చదువు ప్రాథమికోన్నత పాఠశాలతో చెల్లుపడింది.

తల్లీదండ్రికి అయిదుమంది సంతానంలో తన స్థానం రెండవది. అంటే తనకు ముందు అన్న...తన తర్వాత ముగ్గురు. ఒక ఆడ ఇద్దరు మగ. ఇంటికి పెద్ద ఆడకూతురుగా తన పెండ్లి అటు ముందు పుట్టిన అన్న పెండ్లికి ఇటు తన తర్వాత పుట్టిన వాళ్ళ పెండ్లికి పెద్ద ప్రతిబంధకం అన్న సాకుతో అన్నగారు ఎవడి చేతుల్లోనో పెట్టి తనచేతులు దులుపుకొంటే తానేమీ ఎదురు తిరగలేదు. ఎవరినీ నిందించలేదు. ఏం చేసినా ప్రయోజనం ఉండదని తెలుసు కాబట్టి.

పంచభక్ష్య పరమాన్నాలు పెట్టకపోతే మానె. చిని చీనాంబరాలు కట్టించకపోతే మానె. తూగుటుయ్యాలల్లో ఊపకపోతే మానె. కనీసం ఆడదాన్ని ఆడదిగా గౌరవించలేని వెధవలకు పెండ్లీ పెటాకులెందుకు? సంసారాలెందుకు?

అయ్యయ్యో! బొటనవేలు తొక్కి బొట్టుకట్టిన ఆ పుణ్యాత్ముడి చెయ్యి చెయ్యిగాదు.నోరు నోరుకాదు. చుట్టుపక్కల సంసారాలు ఉన్నాయన్న స్పృహకూడా ఉండదు. ఆ నోరు పడే పాటును నిబ్బరించుకోలేక నోరెత్తితే చాలు. చేయి ఆడుతుంది. ఆ పాపిష్టివాడి చెయ్యి ఆడడమంటే అటూ ఇటు కాదే?

చేతికి దొరికిన కుక్క అయినా తప్పించుకొని పారిపోతుంది.అలాంటి అవకాశం కూడా తనకు లేదు? స్పృహతప్పి పడిపోయేవరకు ఎత్తినచెయ్యి దించదే?

భరించింది. ఓపిక ఉన్నంతవరకు భరించింది. చుట్టూ ఉన్న సమాజానికి భయపడి పుట్టింటి పరువు ప్రతిష్టలకు తలవొగ్గి భరించింది. తీరా ఆ మగధీరుడు తాను దూరదానికి కంతలేదు గానీ మెడకొక డోలన్నట్లుగా సరాసరి ఇంటికే ఒక కులుకులాడిని దర్జాగా తెచ్చిపెట్టి దానికి కూడా చాకిరీ చెయ్యమంటే తట్టుకోలేక పోయింది. 'తానా? నేనా?' అంటూ నిలదీసింది. అతగాడు ఏమాత్రం తడపడకుండా, 'తానే!' అనేసరికి తాను తప్పుకొనింది. ఒంటరిగా కాదు. రెండేండ్లు కాపురం చేసిన ఫలితానికి కడుపుతో!

కన్నవాళ్ళు బతికుంటే ఆతీరే వేరు. కడుపుపట్టిన బిడ్డ ఇల్లుపట్టక పోతుందా? అని నిలువ నీడనైనా ఇచ్చేవాళ్ళు. అది కడుపుతీపి. ఆ అవకాశమూ లేకుండా పోయింది.

అయితే ఏం చేయాలి? ఏదో ఒకవిధంగా బతకాలి. చేతకాకుండపోతే చావాలి. తాను ఒక్కతే అయితే ఫరవాలేదు. తెగించి ఏదైనా నిర్ణయం తీసుకోవచ్చు.

కడుపులో కసుగందు. అన్నెంపున్నెం ఎరగదే? చేసిన పాపం చాలక ఆ పాపానికి కూడా ఒడిగట్టాలా? అందుకే బతికింది. మంచి పలుకే ఆస్తిగా...మంచి నడవడి పెట్టుబడిగా... కష్టపడడమే విధిగా_బతికింది.

ఇప్పుడు కొడుకు పదవతరగతి చదువుతున్నాడు. ఎన్ని కష్టాలైనా సరే! పడాలి. వాడిని చదివించాలి. వాడొక ప్రయోజకుడు కావాలి. అప్పుడు తనకష్టాలు కడతేరాలి.

అదీ ఆమె నిర్ణయం!

అందుకోసరమే వాడుపుట్టి చేటలోపడింది మొదలుకొని పుట్టెడు కష్టాలు పడింది. కూలి పనులుచేసింది. కుదరనపుడు పాచిపనులు చేసింది. ఎక్కడ ఏ పనిచేసినా తన వ్యక్తిత్వం మీద మచ్చపడకుండా జాగ్రత్తపడుతూ కొడుకును సాకింది. చదివించింది. ఆ ఏడాదితో హైస్కూలు చదువు పూర్తవుతుంది. ఆ తర్వాత? వాణ్ణి కాలేజీకిపంపాలి. అది తనవల్ల అయ్యే పనేనా? కానప్పుడు వాణ్ణి ఒక కూలివాడుగా తయారుచేసి ఉంటే సరిపొయ్యేది. ఇప్పుడు కాలేజీకి పంపడం తనశక్తికిమించిన పని అని నిలిపేస్తే? వాడి బతుకు ఉట్టికీ స్వర్గానికి కూడా కాకుండా పోతుంది. అంతేగదా? వాడుచదివిన చదువెంత? ఈ పరిస్థితుల్లో ఆ చదువుతో వాడేమి చేయగలుగుతాడు? ఏదైనా పనీపాట చేసుకొని బతకమంటే వాడికి ఒళ్ళొంగదు. కాలేజీ చదువులు చదివించాలంటే తనకు సాగదు. 'ఏం చేయాలిరా తండ్రీ? అని తనలో తాను మధనపడిపోతున్న సమయంలో ఆమె ఒక దినపత్రికలో ఆవార్త చదివింది!

చదివిన వార్తనే మళ్ళీ చదివింది. చదువుకొంటూ ఆనందపడింది. ఆనందపడుతూ ఆలోచించింది. ఆలోచిస్తూ అతడు అవునోకాదో అని సందేహించింది. సందేహిస్తూ కూర్చుంటే లాభమేముంది? ఆ సందేహాన్ని తీర్చుకోవాలి.

అందుకే ఆమె తిరుపతికి బయలుదేరింది.

ఊరి ముందర ఆమె బస్సెక్కింది. బస్సు కదిలింది. వేగాన్ని పుంజుకొనింది. మోకాటిలోతు గుంతల్లో పడ్తూ లేస్తూ గమ్యం చేరడమే నా ధ్యేయం అన్నట్లుగా ముందుకుపోతూ ఉంది. ఆమె ఆ బాటలాంటి తన జీవిత నేపథ్యంలోకి వెళ్ళిపోయింది.

అప్పుడు ఆ ఊళ్ళోనే ప్రాథమిక పాఠశాల. ఆ పాఠశాలలో తాను అయిదవ తరగతి చదువుతూ ఉంది. అతడు హైస్కూల్లో చదువుకొంటున్నాడు. అంటే అతనికి తనకు వయస్సులో ఆరేడేండ్లు తేడా. అతని తండ్రి ఎలిమెంటరీ స్కూలు హెడ్మాష్టర్. ఆ హెడ్మాష్టర్ గారికి తానంటే వల్లమాలిన అభిమానం. దానికి తన తెలివితేటలే కారణమంటే కాదు. అంతో ఇంతో కలిగిన ఇంటిపాప అన్న గౌరవం. ఆ కారణంగా హెడ్మాష్టర్ ఇల్లే తన ఇల్లు అయింది. ఆ ఇంట్లో తన ఇష్టారాజ్యం. చెప్పిన పనులు వినయ విధేయతలతో జాగ్రత్తగా చేసేది. పాఠాలు చెప్పించు కొనేది. శ్రద్ధగా చదువు కొనేది. ఆ దంపతులు తన్ను తెగ మెచ్చుకొంటూ ఉంటే.... తల్లిదండ్రులు పొంగిపోతూ ఉంటే–తన ఆనందానికి పట్ట పగ్గాలుండేవి కావు.

ఆ రోజులు మళ్ళీ రమ్మన్నా వస్తాయా? ఆమె కండ్లల్లో నీళ్ళు తిరిగాయి.

ఎన్నో ఇలాంటి కన్నీటి కథలకు...అనుభూతులకు అనుభవాలకు అలవాటుపడిన బస్సు పెనుమూరు దాటింది. అష్టకష్టాలు పడి లేచిన వాడిని అదృష్టం వరించినట్లుగా తారు రోడ్డు తారసపడింది. బస్సు వేగాన్ని పుంజుకొనింది. అవును. అతడు సెలవుల్లో ఇంటికొచ్చి తిరిగి వెళ్ళిపోతుంటే తనకు తెలియకనే తన కండ్లల్లో నీళ్ళు కమ్ముకొనేవి. అది గమనించిన అతడు గలగల నవ్వుతూ 'ఎందుకే పిచ్చిపిల్లా? నేనేమన్నా దేశంకాని దేశాలకు పోతున్నానా?' అంటూ బుగ్గమీద చిటికె వేసేవాడు.

తన ఒళ్ళంతా ఆ వయస్సుకే గిలిగింతలు పెట్టినట్లయ్యేది. తన పిచ్చికానీ ఇదంతా అతనికి జ్ఞాపకం ఉంటుందా? ఏమో?...

అతడు హెడ్మాష్టర్‌కి ఒక్కగానొక్క కొడుకు. ఆ కొడుకును చదివించుకోవడానికి ఆయన ఎన్ని కష్టాలుపడ్డాడో? పడినా ఫలితం దక్కింది. ఒక యూనివర్శిటీకి వైస్–ఛాన్సలర్ కావడమంటే మాటలా?

నిజంగా ఆ రోజు. పత్రికలో వార్త చదివిన రోజు. తన ఆనందానికి హద్దులే లేవు. పిచ్చిగా ఇంట్లోకి బయటికి అర్థంపర్థం లేకుండా తిరిగింది. మాటిమాటికి కొడుకును గుండెలకు హత్తుకొని ముద్దులాడింది. ఉన్నట్లుండి తన చుట్టుగుడిసె చూడచక్కని మేడ అయినట్లు భ్రమపడింది. ఎవరో తనకు అత్యంత ఆత్మీయుడో అన్నతమ్ముడో ఎదగలేనంత ఎత్తుకు ఎదిగినట్లు సంబరపడింది.

ఆ బస్సులో కూర్చొని తలుచుకొంటూ ఉంటే తనకు సిగ్గేస్తూ ఉంది.

అయినా తన్ను గూర్చి ఇలా ఆనందపడే వ్యక్తి ఈ లోకంలో ఒకరున్నారని ఆ మనిషికి తెలుసా? ఏమో?

మనస్సు పరిపరివిధాల పోతూ ఉంది. ఆ మనస్సును ప్రయత్నించి స్వాధీనంలోకి తెచ్చుకొనింది. ఏ విధంగా అయినా అతనిని యూనివర్శిటీలో కలుసుకోవాలి.

కలుసుకోవడమంటూ జరిగితే ఏమని అడగాలో ఆమె నెమరువేసుకొంటూ ఉంది.

“నాబతుకిట్లా కాలిపొయ్యింది. పుట్టింటికి దూరమైతి. మెట్టినింటికి భారమైతి. నా మాదిరి బతుకులు ఈ భూమికి కూడా భారమే. ఈ భారాన్నట్లా తొలగించుకుందాంవంటే తొలగదోచుకోలేని బిడ్డ. వాడికోసరమే ఊపిరితో ఉండా. నా బతుకువాడికి రాకూడదని రెక్కలు ముక్కలు చేసుకుంటా ఉండా. పూట పూట అంత తింటా ఉండానో లేదో ఆ దేవుడికే ఎరిక. ఎట్నో వొకట్టా వాణ్ణి పదో తరగతిదాక చదివించినాను. ఇంక నిగ్గేదానికి నా వల్లకాదు. ఈ చదువుతో బతుక్కుండే దానికి వాడివల్లా కాదు. ఏం చెయ్యమంటావు చెప్పు? ఈ పాపిష్టిదాని కడుపున పుట్టినవాడు ఇన్ని గాదు ఇంకెన్ని జన్మాలెత్తినా నీ అంతటోడు కాలేడు. వాడి బతుకు వాడట్టా బతుక్కుంటే చాలు. అమ్మా అబ్బా ఏ జన్మలో చేసుకుణ్ణ పూజాఫలమో? లేదు. నువ్వు చేసుకుణ్ణ పుణ్యమో? ఒక యూనివర్శిటీ నీ చేతుల్లో ఉంది. ఏదైనా ఒక పని. కనీసం చెత్త ఊడ్చే పనైనా చాలు. నా బిడ్డను చదివించుకుంటాను” అని అడగాలనుకొనింది.

‘అడగతావో? అడగలేవో? అది నీపని. నాపని అయిపోయింది’ అన్నట్లుగా ఎర్రబస్సు తిరుపతి బస్టాండ్‌లో కస్సుబుస్సులాడుతూ నిలబడింది.

ఆమె బస్సు దిగింది.

దిగి దిక్కులుచూస్తూ నిలబడింది. నిలబడక ఏంచేస్తుంది? ఎవరో వెంటపడి తరుముతున్నట్లు వస్తూ పోతూవున్న బస్సులరొద...బస్సులు ఎక్కడానికో దిగడానికో మనుషులు పడుతున్న హడావిడి...కూలిపోర్టర్ల గోల...రిక్షాల అడ్డగింపులు– అదొక పెద్ద సంతలా ఉంది. అక్కడ నిలబడి చూస్తుంటే తూర్పు పడమరలు కూడా తెలియడం లేదు. బయట పడడం ఎలా అని ఆలోచిస్తూ నిలబడింది. నిలబడి అటూయిటు కదలలేక దిక్కులు చూస్తూ ఉంది.

దిక్కులు చూస్తూ ఒక ఆడది ఒంటరిగా నిలబడితే? అదిగూడా బస్టాండ్‌లో. ఇక చెప్పాలా? కొన్ని వాలుచూపులు...కొన్ని వంకరచూపులు...కొన్ని ఆకలిచూపులు..కొన్ని కొంటెచూపులు ఆమెను చుట్టుముట్టాయి.

“ఛీఛీ! ఏం మనుషులో ఏం పాడో? ఆడది ఒంటరిగా కనిపిస్తే చాలు. పిచ్చికుక్కలకన్నా హీనమైపోతారు. వీళ్ళకు కొంపల్లో అక్కచెల్లెళ్ళు లేరా? పెండ్లాం పిలకాయిలు లేరా? వాళ్ళెప్పుడూ ఒంటిగా బయటికిపోరా? పోతే వాళ్ళ గతికూడా ఇంతేనని వీళ్ళకెందుకు తోచదు? అవునుగదా! ఆమాత్రం జ్ఞానం ఉంటే వీళ్ళు మనుషులెట్లవతారు?” అని ఆలోచిస్తూ ఉంటే ఆమె దృష్టి గుదికట్టిన పువ్వుల్లా ఉద్దగా నడుస్తున్న అమ్మాయిల మీద పడింది.

రెండు నిముషాలు! నాలుగు అడుగులు! ఆమె వాళ్ళతో కలిసిపోయింది. కలిసి నాలుగు నాలుగు ఎనిమిది అడుగులు వేసింది. అప్పటికే వాళ్ళు బస్టాండ్ బయటపడ్డారు. అప్పుడు అడిగింది వాళ్ళని.

"మీరు ఎక్కడిదాకా పోతున్నారమ్మా? అని.

"నువ్వెక్కడికి వెళ్ళాలి?"

పడుచుదనం ప్రశ్నించింది.

"యూనివర్శిటీకి".

మాట చెవిన పడడం...అడుగు ముందుకు పడకుండా వాళ్ళు నిలబడడం...ఆమెవైపు వింతగా చూడడం...తరువాత ఒకరి మొగం ఒకరు చూసుకొంటూ ముసిముసిగా నవ్వుకోవడం. క్రమం తప్పకుండా ఒకదాని వెంబడిఒకటి క్షణాల్లో జరిగిపోయాయి.

చూడరాని మనిషిని ఎవరినో చూసినట్లు...వినరాని మాటేదో విన్నట్లు...జరగరానిదేదో జరిగిపోయినట్లు...వాళ్ళు ఆశ్చర్యపడడం నవ్వుకోవడం ఆమెకేమీ అర్థం కాలేదు. కానీ సరి ఆడమనిషి పట్ల చదువుకొంటున్న అమ్మాయిలు ప్రవర్తించిన తీరుమాత్రం ఎక్కడో గుండెసందుల్లో దూరి కలుక్కుమనింది. అది మొగంలో మసకేసింది. 'కాలం ఎంత మార్పు తెచ్చింది?' అనుకొంటూ ఆమె నిట్టూర్చింది.

వాళ్ళల్లో ఒక అమ్మాయి అది గ్రహించింది.

"అక్కడ మీ అమ్మాయిలెవరైనా చదువుకొంటున్నారా?"

"నాకు అమ్మాయిలే లేరు."

"అదృష్టవంతురాలివే? అయితే యూనివర్శిటీలో ఏంపని?"

"వీసీగార్ని చూడాలి."

అంతై ఇంతై వటుడింతై అన్నట్లుగా ఆశ్చర్యం అందరి కన్నుల్లో నిండి పండుతూ ఉంది.

"వీసీగారు మీ బంధువా?"

"కాదు. తెలుసును."

ఒకనాటి ఆమె అందానికి వీసీకి ముడిపెట్టే ప్రయత్నం సందేహమై వాళ్ళకన్నుల్లో దోబూచులాడుతూ ఉంది. ఆమె ఆమాత్రం గ్రహించలేనంత అమాయకురాలేమీ కాదు. ఆమె తల వాలిపోయింది. అడుగుమాత్రం ముందుకు పడింది.

వేషంలో పల్లెటూరి ఛాయలు కనిపించినా మనస్సు మాత్రం సున్నితమయిందని చూపులే చాటుతున్నాయి. చదువుకొన్న అమ్మాయిలు కదా? గ్రహించారు.

"యూనివర్శిటీకి వెళ్ళాలన్నారు. మరి వెళ్ళి పోతున్నారే?"

వాళ్ళల్లో ఒక అమ్మాయి అడిగింది.

"ఏం చెప్పమంటారు చెప్పండమ్మా? వీసీగార్ని చూడాలనగానే మీమీ సందేహాల్తో మీరు సతమతమవుతూ ఉంటే ఇంక నాదారి నేను చూసుకోక తప్పుతుందా?" అడగాలనుకొన్న మాటను అడిగింది. మాటలతో కాదు. చూపులతో గుచ్చిగుచ్చి. అమ్మాయిల నోళ్ళు మూతలు పడ్డాయి.

"మేము వెళ్తున్నది యూనివర్శిటికే. మాతో రామ్మా!"

అందరు కలిసి ముందుకు నడిచారు. టౌన్ బస్సు ఎక్కారు. మూడు కిలోమీటర్ల దూరం. ఆ బస్సు ముప్పైచోట్ల ఆగుతూ సాగుతూ ముప్పైనిమిషాల లోపుగానే యూనివర్శిటీ క్యాంపస్ చేరుకొనింది.

అక్కడ అందరితో కలిసి ఆమె కూడా బస్సు దిగింది.

"చూడమ్మా! ఆ బిల్డింగ్‌ను చూడు. ఆ బిల్డింగు ముందు ప్రకాశం పంతులుగారి విగ్రహం కూడా ఉంటుంది. ఆ టవర్‌క్లాక్ కనిపిస్తూ ఉందే ఆ బిల్డింగ్‌లోనే వీసీగారుండేది."

కృతజ్ఞతాపూర్వకంగా ఆమె రెండు చేతులు జోడించింది. ఆ అమ్మాయిల వద్ద సెలవు తీసుకొనింది. టవర్ క్లాక్ గుర్తుగా ఆ బిల్డింగ్ ముందుకు నడిచింది. సరాసరి లోనికి వెళ్ళడానికి ప్రయత్నించింది.

సెక్యూరిటీ గార్డు అడ్డు పడ్డాడు– చూపులతో గుచ్చుతూ. చేతిలో కర్ర అడ్డుపెడ్తూ.

ఏమాత్రం తటపటాయించకుండా–

"వీసీగార్ని చూడాలి" అన్నది.

"వీసీగార్ని చూడాలా? ఎవరు నువ్వు?"

ఆమె ఒక్క క్షణం ఆలోచించింది. ఎదురుగా బెదిరిస్తూ కాకిబట్టలు. వాటి డాబు దర్పాలు కొంతకుకొంత ఎరుకే. తప్పదనిపించింది.

"వాళ్ళ బంధువును."

మాటతో కూడా సెక్యూరిటీ గార్డు నిటారుగా నిలబడి సెల్యూట్ కొట్టాడు. ఆమె గుండె తేలికపడింది. అడుగు ముందుకు పడింది.

"వారు ఇప్పుడే ఇంటికి వెళ్ళిపోయారమ్మా!... "ఈ వేళ సాయంకాలం భీమాస్ హోటల్లో వారికి సన్మానం ఉంది. బహుశా వారు ఈ పూట ఆఫీసుకు రాకపోవచ్చు."

విర్రవీగిన కాకిబట్టలు వినయానికి ప్రతీకలయ్యాయి!

"భీమాస్ హోటల్ ఎక్కడుందయ్యా?"

"సన్మానం సాయంకాలం అయిదుగంటలకు. ఇప్పుడే అక్కడికెందుకమ్మా? మీరు టౌన్‌లోకి వెళ్ళేటప్పుడు కుడిపక్కన పెద్దతోట కనిపిస్తుంది కదా? ఆ తోటలోనే అయ్యగారి బంగళా. మీరు ఇంటికే వెళ్ళొచ్చుగదా?"

"ఇంటికే వెళ్తాననుకో. ఆ హోటల్ ఎక్కడుందో తెలుసుకుందామని!"

"ఈ ఊళ్ళోకంతా అదే పెద్ద హోటల్. రైల్వే స్టేషన్ దగ్గరే. ఎవర్నడిగినా చెప్తారు."

మారు మాట్లాడకుండా ఆమె తిరుగుముఖం పట్టింది. యూనివర్శిటీకి రావడానికి బస్సెక్కింది రైల్వేస్టేషన్ సమీపంలోనే. వస్తూ దారిపొడుగునా కొన్ని కొండగుర్తులు పెట్టుకొంటూనే వచ్చింది. అందువల్ల రైల్వేస్టేషను చేరుకోవడం పెద్ద ఇబ్బందిగా తోచలేదు.

"ఇంటికే పోవచ్చు. గుర్తు పట్టినా పట్టకపోయినా ఫలానా అని చెప్పుకోవచ్చు. తన పరిస్థితిని వివరించుకోవచ్చు. ఏదైనా సహాయం చెయ్యమని అడగవచ్చు. చేస్తే చేస్తాడు. లేకుంటే కాదంటాడు.అప్పుడు 'అయ్యో! అడగకుండా పోతినే!' అన్న బాధ మిగలదు. కానీ సాయంకాలం సన్మానం ఎంత గొప్పగా చేస్తారో ఏమో? పెద్ద పెద్దోళ్ళు ఎంత మంది వస్తారో ఏమో? ఆ సన్మానం చూడాల్సిందే. అడిగేదేదో అక్కడ అడిగితే సరిపోతుంది. చేసే సహాయం తలరాత మీద ఆధారపడుతుంది. ఈ జన్మానికి అటువంటి అదృష్టం రమ్మన్నా వస్తుందా?".

ఆలోచించుకొంటూ నడుస్తూ ఉంది. నడుస్తూనడుస్తూ బాటకు కుడిపక్కన అందాల తోటను చూసింది. అంతపెద్ద తోటలో అందాల బంగళాను ఊహించు కొనింది. ఆ బంగళాను తన ఊళ్ళో ఒకప్పటి మూడంకణాల పూరింటితో పోల్చుకొనింది. బండ్లు ఓడలు కావడమంటే ఇదేనేమో అని నవ్వుకొంటూ నడుస్తూ ఉంది.

రైల్వేస్టేషన్ చేరుకోవడం...ఆస్టేషన్‌కు అతిసమీపంలో ఉన్న భీమాస్ హోటల్‌ను వెదుక్కోవడం పెద్దశ్రమ అనిపించలేదు.

ఆమె భీమాస్ హోటల్ ముందు నిలబడింది. పొద్దు వాలుతూ ఉంది. శీతాకాలం సూర్యుడి లేయెండ వెలుగులో ఆ భవనం మెరిసిపోతూ ఉంది. సాయంకాలం ఆ హోటల్లో జరిగే సన్మానాన్ని ఊహించుకొంటూ తనను లోనికి రానిస్తారో? లేదో? అని ఆలోచించుకొంటూ తల వెనుకకు తిప్పింది. ఎదురుగా గోవిందరాజస్వామి దేవాలయ గోపురం! ఎత్తులో ఒకదానితో ఒకటి పోటీపడుతున్నట్లుంది. మరొక మూడుగంటలు కాలం గడపడానికి గుడి భద్రమనుకొనింది గుడివైపు నడుస్తూ!

గంట నాలుగు దాటింది. శీతాకాలం ఎండ లోకానికిబంగారుపూత పూస్తూ ఉంది. గాలిగోపురం మీద బంగారుపూత కలశాలు పేదవాడి ఆశల్లా మెరుస్తున్నాయి. రకరకాల బోడి గుండ్లు 'గోవిందా! గోవిందా!" అని అరుస్తూ రైల్వేస్టేషన్ వైపు నడుస్తున్నాయి. రకరకాల తగ్గింపు ధరల ప్రచారంతో చెవులు చిల్లులుపడుతున్నాయి. జనం జనం. అసలే ఇరుకురోడ్లు మరీ గజిబిజిగా. చాలా బిజీగా ఎవరి తాపత్రయం వాళ్ళదిగా!

కార్లల్లో వస్తున్నారు. స్కూటర్ల మీద వస్తున్నారు. ఆటోల్లో వస్తున్నారు. సైకిళ్ళమీద వస్తున్నారు. కాలి నడకన వస్తున్నారు. రకరకాల వ్యక్తులు వచ్చి ఆ హోటల్ ముందు నిలబడి స్వాగత తోరణాలమధ్య కట్టిన బ్యానర్ వైపు చూస్తున్నారు. తలపంకిస్తూ చిరునవ్వులు చిందిస్తూ హుందాగా హోటల్లోకి నడుస్తున్నారు.

ఆమె అందరినీ గమనిస్తూ నిలబడింది. నిలబడి లోనికి వెళ్ళడానికి తటపటాయిస్తూ ఉంది.

అయిదారుమంది ఆడవాళ్ళు. అందరు దాదాపు తన ఈడువాళ్ళే. వయ్యారాలు పోతూ నవ్వులు చిందిస్తూ నడుస్తున్నారు. చుట్టూ ఒక ప్రపంచం ఉన్నదన్న స్పృహే వాళ్ళకు లేదు. ఆమె కోరుకొనింది కూడా అదే. వాళ్ళతో కలిసిపోయింది.

ఆ హోటల్ అయిదవ అంతస్తులో హాలు. ఆ హాల్లో వేదిక. రంగు రంగుల విద్యుద్దీపాలు. రకరకాల పూల అలంకరణ. చుట్టూ అలంకరించిన పూలతొట్లు. సుందర సాహితీ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న సన్మానం వివరాలతో బ్యానర్...రాజసింహాసనాల్లా అయిదారు కుర్చీలు. వాటిముందు అలంకరించిన టేబిల్. ఆవేదిక ఒక పెండ్లి మండపాన్ని తలపింపచేస్తూ ఉంది.

తీపు తింటూ కొందరు...కారాలు నములుతూ కొందరు...కాఫీలు సేవిస్తూ కొందరు! నిర్వాహకుల హడావిడి అంతాయింత కాదు. వాళ్ళ ఇండ్లల్లో జరిగే శుభకార్యాలకైనా అంత శ్రమపడతారా? అన్న సందేహం కలుగుతూ ఉంది.

అధికారాలకు ఆత్మీయతలకు అవినాభావ సంబంధం తప్పదేమో?

అయిదు గంటలకు అయిదు నిముషాలు అటు ఇటుగా వైస్-ఛాన్సలర్ కలెక్టర్ గారితో కలిసి రావడంతో సద్దు మణిగింది. సభ ప్రారంభమయింది.

ఈలాంటి సన్మానాల అవసరం.వాటి ప్రయోజనాలను వివరిస్తూ ఒక వ్యక్తి గంభీరంగా ఉపన్యసించి వేదికమీద ఆసీనులు కావలసిన పెద్దలకు స్వాగతం పలికాడు. ఆ పెద్దలు ఒక్కొక్కరుగా వెళ్ళి వాళ్ళ స్థానాల్లో కూర్చున్నారు. పూల మాలలు వేయడం... వీసీగారి గుణగణాల్ని మేధాసంపత్తిని కొనియాడడం... సన్మానం చేయడం...సన్మానపత్రాలు సమర్పించడంతో ముంచి తేల్చితే వైస్- ఛాన్సలర్ గారికి దాదాపు గుక్క తిప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఒక్క మాటలో చెప్తే సరిపోతుంది.

సన్మానానికి కృతజ్ఞతలు తెలుపడానికి వీసీగారు పైకి లేచారు.

ఆమెమెడ పైకిలేచింది. కన్నులు విప్పారి ఇంతింత అయ్యాయి. అతనివైపు రెప్పార్చకుండా చూస్తూ ఉంది. గతంలోకి వెళ్ళడానికి మనస్సు ఎంత ప్రయత్నించినా వీలుపడడం లేదు.

"అందరు అనుకుంటారు- నేను చాలా అదృష్టవంతుడినని! అయితే ఆ అదృష్టం ఈ పదవిని తెచ్చి నాకు బహుమతిగా ఇవ్వలేదు. ఏదో లాటరీ ఛాన్సులా తగిలింది కాదు. దీని వెనుక ఎంతో కృషి ఉంది. పట్టుదల ఉంది. ప్రయత్నం ఉంది.

గతంలోకి వెళ్ళదానికన్నట్లుగా ఆయనకాసేపు నిమీలితనేత్రుడై నిలబడ్డాడు. ఆ తరువాత-

ప్రస్తుతాన్ని కాసేపు మరిచి గతంలోకి వెళ్ళితే నేను యస్.యస్.యల్.సి. మంచి మార్కులతో పాసైతే మా తండ్రి ఎంతో సంతోషించాడు. పై చదువులు చదివించాలని కాదు. సెకండ్ గ్రేడ్ ట్రెయినింగ్‌లో నాకు ఎవరి రెకమెండేషన్ లేకుండానే సీటు వస్తుందని! అది ఆయన తప్పుకాదు. సెకండ్ గ్రేడ్ టీచర్‌గా అది ఆయన పరిస్థితి. కానీ ఆ స్కూల్లో హెడ్మాష్టర్ 'తెలివైన పిల్లవాడి భవిష్యత్తును నాశనం చెయ్యవద్దు!' అని పట్టుబట్టిన కారణంగా కాలేజ్‌లో చేరాను. డిగ్రీ సాధించాను. ఆ సాధనలో ఎన్ని కష్టాలో? ఎన్ని కన్నీళ్ళో?

అతని గొంతు పూడుకపోయింది.

ఆమె కన్నుల్లో నీళ్ళు తిరిగాయి.

"డిగ్రీకూడా చాలామంచి మార్కులతో పాసయ్యాను. అప్పుడు కూడా మా తండ్రి సంతోషించాడు– నేను గ్రాడ్యుయేట్ టీచర్ అవుతానని. కానీ నాలో పైచదువులు చదవాలన్న పట్టుదల సడలలేదు. తాను సెకండ్‌గ్రేడ్ టీచర్ అయినా తన కొడుకు గ్రాడ్యుయేట్ టీచర్ అయితే చాలన్న అభిప్రాయం తండ్రిగారిది. కానీ నా అభిప్రాయం అదికాదు. అందుకే జిల్లాకలెక్టర్ గారి దగ్గరకు వెళ్ళాను. వారికి నా మార్కులు చూపించాను. 'అయ్యా! నాకు చదువుకోవాలని ఉంది. అయితే శక్తిలేదు. దయచేసి నాకొక అన్‌ట్రెయిన్డ్ టీచర్ ఉద్యోగం ఇప్పించండి. కొంతకాలం పనిచేస్తాను. కొంత డబ్బు మిగిల్చుకొంటాను' అని అభ్యర్థించాను. ఆ దయామయుడు నా పాలిట దైవం. ఉద్యోగం ఇవ్వడమేకాదు. తన బంగళాలోనే ఉంటూ తన పిల్లలకు ట్యూషన్ చెప్పమని నెలకు వంద రూపాయలు సహాయం చేశారు. లేకుంటే నా పరిస్థితి ఏమయ్యేదో ఈ వేళ తలుచుకొంటూ ఉంటే–"

ఆమె మనస్సులో తళుక్కున ఒక ఆలోచన మెరిసింది.

"అవును! ఆ రోజు అడగ్గానే కలెక్టర్ ఉద్యోగం ఇచ్చినాడు కాబట్టి ఈ వేళ ఆయన ఇంతటి వాడయ్యారు. ఈ రోజు నేనడుగుతాను. ఏ పనైనా సరే! కడకు చెత్తఊడ్చే పనైనా ఇప్పించమని. నా బిడ్డను చదివించుకుంటాను అని!"

ఇటువంటి అవకాశం వస్తుందని ఆమె ఊహించలేదు. రొట్టె విరిగి నేతిలో పడడమంటే ఇదేనేమో? ఆ క్షణంలో ఆమె తన అదృష్టాన్ని తలుచుకొని ఎంత ఉప్పొంగి పోయిందో? ఆ ఆనందంతో వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయింది. ఆ బలంతో ఆమె పైకి లేచింది.

చిట్ట చివరి వరుస కాబట్టి సరిపోయింది. లేకుంటే ఎందరి దృష్టిలో పడేదో? ఎటువంటి పరిస్థితిని సృష్టించేదో?

ఆమె గొంతు సవరించుకొనింది. నమస్కరించడానికి చేతులు పైకి లేస్తున్నాయి. కానీ అంతలోనే ఎవరో పట్టి కిందికి లాగినట్లు చేతులు పడిపోయాయి. పొంగుతున్న పాలమీద కాసిన్ని మంచినీళ్ళు చల్లినట్లు ఆమె ఉత్సాహమంతా చప్పచల్లారి పోయింది.

"అవును. ధైర్యం చేసి అడగతాను. అట్లా అడిగినందుకు నన్ను అందరు మెచ్చుకొంటారు కూడా. ఇంతమందిలో అడిగితే కాదనలేక ఆయన ఏదో ఒకటి చెప్పాలి. చెయ్యాలి. అప్పుడు అదొక పెద్ద వార్త అయిపోతుంది. పత్రికలన్నీ పెద్ద పెద్ద అక్షరాలత్తో ఆయన మంచితనాన్ని కొనియాడుతూ అచ్చు వేస్తాయి. అంతవరకు బాగానే ఉంది. అయితే ఇది ఆయనకు జరుగుతున్న మొదటి సన్మానం అంటూ ఉండారుగదా? ఇకమీదట కూడా ఇటువంటి సన్మానాలు జరగతాయి కదా? దీన్ని ఆసరాగా తీసుకొని ఎంతోమంది నాలాంటి వాళ్ళు ఆయన మీద పడతారు. అందరికీ ఉద్యోగాలు ఇవ్వగలడా? ఇచ్చి అందరినీ సంతృప్తి పరచగలడా? అది అయ్యే పనేనా? అంటే– ఆయన ఇరకాటంలో పడతాడు. దీనికి కారణం ఎవరు? నేనే! ఛీఛీ! నా బాగుకోసరం ఇంత మంచి మనిషిని ఇరకాటంలో పెట్టడమా? ఊహూం!"

ఆ తర్వాత ఆమె ఒక్క క్షణం అక్కడ నిలబడలేక పోయింది. ఆ సన్మానం ద్వారా అతడు పొందిన అనుభూతి అతని మాటల్లో కన్నుల్లో ప్రతిఫలిస్తూ ఉంది. తన సన్మానానికి కారకులైన వాళ్ళందరికి పేరుపేరున కృతజ్ఞతలు చెప్తున్నాడు!

అయితే ఆ సన్మానంలో ఆయనకు వేసిన దండలు...పెట్టిన దండాలు...కప్పిన దుశ్శాలువలు...చదివిన అభినందన పత్రాలు...అగడ్తలు దాటిన పొగడ్తలు-అన్నిటి వెనుక గులాబీలమాటున దాగిన ముళ్ళులా స్వార్థం! ఆమె చేసింది మాత్రం త్యాగం!! అంటే ఈ లోకం నవ్వుతుంది. ఏమిటి ఆమెచేసిన త్యాగమని నిలదీస్తుంది. అంతేగదా! సుందరమూ సునిశితమైన ఏ సద్గుణాలతో మనిషి మనిషిగా పరిగణింపబడుతున్నాడో ఆ గుణాల విలువలను మరిచిపోతున్న సంధికాలం ఇది. కేవలం ఒక చిన్న పనిని సాధించుకోవడానికి స్వార్థం హత్యలు చేయించడానికి వెనుకాడని పోగాలం ఇది. ఈ కాలంలో మనుషులు ఆమె చేసింది త్యాగమంటే అంగీకరిస్తారా? అందుకే ఇలాంటి వాళ్ళ ఆలోచనలు అవగాహనలు త్యాగాలు అన్నీ బూడిదలో పోసిన పన్నీరే!

ఆ హోటల్లో అయిదవ అంతస్తులో నిలబడి వీసీగారి అభినందనలతో ఉబ్బితబ్బిబ్బులైన గుండెలు... విలువైన దుస్తుల ముసుగులో మురిసిపోతున్న నాగరీక గుండెలు- మరొక అయిదంతస్తులపైకి! సహృదయతకు...త్యాగానికి మారురూపు ఒక్కొక్క మెట్టుగా కిందికి! ●

స్వాతి మాసపత్రిక
(1, జూలై, 1994)